సాక్షి
చిత్తూరు

శనివారం । 22 । జులై । 2023



'జన ఔషధి'కి ఝలక్!

ప్రజలకు చౌకగా మందులు విక్రయించే జెనరిక్ దుకాణాలను నష్టాల సాకును చూపించి మూసివేస్తున్నారు.

- IIలో



పేదల గుండె నిండా జగనన్నే

తిరుపతిలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు.

- IIలో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	34	27
తిరుపతి	36	28
తిరుమల	31	23
గూడూరు	36	29
నగరి	36	28

న్యూస్‌రీల్

సెలవుపై కుప్పం సబ్ రిజిస్ట్రార్

చిత్తూరు కార్పొరేషన్: కుప్పం సబ్‌రిజిస్ట్రార్ వ్యక్తిగత కారణాలతో 15 రోజులు సెలవుపై వెళ్లారు. ఇటీవల అక్కడ నకిలీ పత్రాలతో జరిగిన రిజిస్ట్రేషన్ వివాదాస్పదంగా మారిన నేపథ్యంలో ఆయన సెలవు తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై సబ్‌రిజిస్ట్రార్, అమ్మకపు, కొనుగోలుదారులపై పోలీసులు కేసు నమోదు చేశారు. నకిలీ రిజిస్ట్రేషన్‌పై జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు నివేదిక సిద్ధం చేసి డీఐజీకి అందజేశారు. ప్రస్తుతం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ సహాయకులకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

ఆగస్టులో టిడ్కో గృహాల ప్రారంభం



నిర్మాణ పనులు పరిశీలిస్తున్న టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

పుంగనూరు : పట్టణంలో నిర్మించిన టిడ్కో ఇళ్లను ఆగస్టులో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్ తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, చైర్మన్ అలీమ్‌బాషాతో కలసి గూడూరుపల్లె వద్ద నిర్మించిన టిడ్కో గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా రూ.2.52 కోట్లతో నిర్మించిన వాటర్ ట్రీట్‌మెంట్ ట్రయల్ రన్‌ను పరిశీలించారు. కాలనీలో విద్యుద్దీకరణ, సిమెంటు రోడ్లు, కాలువ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. టిడ్కో చైర్మన్ మాట్లాడుతూ పుంగనూరులో నిర్మించిన 1,536 టిడ్కో గృహాలను ప్రారంభించడంపై మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో చర్చించామన్నారు. పనులు వేగవంతంగా పూర్తిచేస్తున్నామని వెల్లడించారు. రూ.4.12 కోట్ల వ్యయంతో మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు వివరించారు. జగనన్న కాలనీలతో పట్టణాలు, గ్రామాల్లో టౌన్‌షిప్‌లు తయారవుతున్నాయని చెప్పారు. పేద ప్రజల కోసం పక్కా గృహాలు నిర్మిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని, జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసేందుకు సైనికుల్లా పని చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నాగేంద్ర, డీఈఈ మహేష్ పాల్గొన్నారు.

ఉద్యోగుల గ్రీవెన్స్‌కు 46 వినతులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : ఉద్యోగుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఈ మేరకు ప్రభుత్వోద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రతి నెలా మూడో శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రత్యేక గ్రీవెన్స్ డే నిర్వహించారు. కలెక్టర్ షణ్మోహన్, డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి ఉద్యోగుల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించిన 46 మంది ఉద్యోగులు వినతులు సమర్పించారు. ఉద్యోగులు తమ సమస్యలను ఉన్నతాధికారులకు విన్నవించుకునే అవకాశం కల్పించిన ప్రభుత్వానికి వీఆర్‌ఓల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలాజీరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఎంప్లాయీస్ వెల్ఫేర్ ఫండ్ నుంచి ఉద్యోగులకు రుణాలు, జాయింట్ కౌన్సిల్ సమావేశం నిర్వహణ, చీలాపల్లె సీఎంసీలో హెల్త్‌కార్డులను అమలుపై ఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు రాఘవులు, కార్యదర్శి రఘు, ఉపాధ్యక్షుడు బాలసుబ్రమణ్యం వినతిపత్రం అందించారు.

85 శాతం పెన్షనర్ల ఈకేవైసీ పూర్తి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ప్రభుత్వ పెన్షనర్ల ఈకేవైసీ ప్రక్రియ 85 శాతం పూర్తయిందని ట్రెజరీ డీడీ రామచంద్ర తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలో 12 వేల మంది పెన్షనర్లు ఉన్నట్లు చెప్పారు. వీరిలో 85 శాతం మంది సంబంధిత శాఖల సబ్‌ట్రెజరీ కార్యాలయాల్లో ఈకేవైసీ నమోదు చేసుకున్నారన్నారు. కదల్లేని స్థితిలో ఉన్న పెన్షనర్ల కుటుంబాలకు సమాచారం అందించినట్లు తెలిపారు.

మురిపిస్తూ.. వరాల జల్లు కురిపిస్తూ!

- అట్టహాసంగా వైఎస్సార్ నేతన్న నేస్తం
- వెంకటగిరిపై సీఎం జగనన్న వరాల వర్షం
- ఆల్తూరుపాడు రిజర్వాయర్‌కు రూ.553 కోట్లు
- వెంకటగిరి రూరల్‌కు రూ.20 కోట్లు
- జీజీఎంపీకి రూ.50 లక్షల చొప్పున మంజూరు
- బీసీ భవన్‌కు గ్రీన్ సిగ్నల్
- ప్రియతమ నేతను చూసి ఉప్పొంగిన జనం

అదే ఉత్సాహం.. అడుగడుగునా నీరాజనం .. ఊరంతా జన ప్రభంజనం.. ప్రియతమ నేతను చూసి మురిసిన జనం.. నేతన్నకు అభయహస్తం.. రాజులేలిన వెంకటగిరిపై వరాల వర్షం.. ఇదీ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంకటగిరి పర్యటనలో కనిపించిన దృశ్యం.. నేతన్న నేస్తం ఐదో విడత నిధులు విడుదల కార్యక్రమం అట్టహాసంగా సాగింది. ఉదయం నుంచే వెంకటగిరి పట్టణం జనంతో కిక్కిరిసిపోయింది. విశ్వోదయ కళాశాల నుంచి సభాప్రాంగణం వరకు జై..జగన్.. జైజై..జగన్.. సీఎం జిందాబాద్ నినాదాలతో హోరెత్తింది. సీఎం ప్రసంగం కార్యకర్తలు, నేతలు, అక్కచెల్లెమ్మల్లో నూతనోత్సాహాన్ని నింపింది.



చేనేత కార్మికుడితో కలిసి మగ్గం నేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



వెంకటగిరిలో ముఖ్యమంత్రి సభకు హాజరైన అశేష జన సందోహం

వెంకటగిరి: వెంకటగిరి నియోజకవర్గంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వర్షాల జల్లు కురిపించారు. వైఎస్సార్ నేతన్న నేస్తం ఐదో విడత నిధుల విడుదల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వెంకటగిరికి విచ్చేసిన ఆయనకు స్థానిక సమస్యలపై స్పందించారు. తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ప్రతిపాదనలకు ఆయన సానుకూలంగా స్పందించారు. నియోజకవర్గంలోని డక్కిలి మండలం, ఆల్తూరు పాడు రిజర్వాయర్‌ను పూర్తిచేసేందుకు రూ.553 కోట్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి, సైదాపురం, కలువాయి, రాపూరు మండలాల్లో సీసీ రోడ్లు, డ్రైన్లు తదితర మౌలిక వసతుల కల్పనకు రూ.20 కోట్లు మంజూరు చేస్తామని చెప్పారు. రూరల్ మండలాల్లో ఇరిగేషన్ చెరువుల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని, వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలోని సచివాలయాల పరిధిలో అభివృద్ధి పనుల కోసం ఒక్కో సచివాలయానికి రూ.50 లక్షల చొప్పున మంజూరు చేస్తామని ప్రకటించారు. వెంకటగిరిలో బీసీ భవన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మతల్లి జాతరను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తామని సీఎం ప్రకటించారు.

జనజాతర

వెంకటగిరి పట్టణం జనంతో కిక్కిరిసింది. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఉదయం 10.15 గంటలకు వెంకటగిరికి చేరుకోగా.. ఆయనకు తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి కే.నారాయణ స్వామి, రాష్ట్ర మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, అమర్‌నాథ్, తిరుపతి ఎంపీ డాక్టర్ ఎం గురుమూర్తి, ఎమ్మెల్సీలు బల్లి కళ్యాణ్‌చక్రవర్తి, మేరుగ మురళీధర్, చంద్రశేఖర్ రెడ్డి, గూడూరు, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, సత్యవేడు, ఆత్మకూరు ఎమ్మెల్యేలు వరప్రసాద్‌రావు, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, కే.ఆదిమూలం, మేకపాటి విక్రమ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎస్వీబీసీ చైర్మన్ సాయికృష్ణయాచేంద్ర, చిత్తూరు, నెల్లూరు జెడ్పీ చైర్మన్లు జీ.శ్రీనివాసులు, ఆనం అరుణమ్మ, ఆనం జయకుమార్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు. స్థానిక విశ్వోదయ కళాశాల హెలీప్యాడ్ ప్రాంతం నుంచి సీఎం వైఎస్సార్‌నేతన్న నేస్తం సభాప్రాంగణం వరకు ప్రత్యేక బస్సులో రోడ్‌షో నిర్వహించారు. రోడ్లకు ఇరువైపులా ప్రజలు ఎదురునిలబడి ప్రియతమ నేతను చూసి జై జగన్.. జైజై జగన్ నినాదాలు మిన్నంటించారు. సీఎం..జిందాబాద్ అంటూ కేరింతలు కొట్టారు. ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వారికి అభివాదం చేస్తూ ముందుకు సాగారు. సభాప్రాంగణం వద్ద చేనేతలతో మమేకమయ్యారు. చేనేతలతో కలిసి ఫొటోషూట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన సభలో ప్రసంగిస్తున్నంత సేపు ప్రజలు కేరింతలు కొడుతూ ఉత్సాహంగా కనిపించారు. చేనేతల్లో విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్రపతి అవార్డు సాధించిన కూనా మల్లికార్జున్, బోగా రాము, చీరాలరెడ్డి, గౌరబత్తిన రమణయ్య, సజ్జా వీరయ్యను సీఎం ఆప్యాయంగా సత్కరించారు. రాజాకుటుంబీకులు డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర, సర్వజ్ఞ కుమార యాచేంద్ర జ్ఞాపికను బహూకరించారు. చేనేతలు దండలు వేసి సీఎంను సత్కరించారు.



రేణిగుంట ఎయిర్‌పోర్టులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మంత్రులు పెద్దిరెడ్డి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కే రోజా, నారాయణస్వామి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దళారీలు పడ్డారు!

- చేతులు తడిపితేనే రిజిస్ట్రేషన్లు
- దస్తావేజుల తయారీకి రూ.వేలల్లో వసూళ్లు
- డాక్యుమెంటేషన్ పర్యవేక్షణలో విఫలమైన అధికారులు



కుప్పం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

కుప్పం : కుప్పం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దళారీల దోపిడీ పెరిగిపోయింది. అడిగినంత ఇస్తేనే రిజిస్ట్రేషన్ పూర్తయ్యే పరిస్థితి ఏర్పడింది. చివరకు నకిలీ పత్రాలతో డాక్యుమెంటేషన్ అయినా కాసులు ముట్టజెప్పితే ఎలాంటి పరిశీలన కూడా లేకుండా ప్రక్రియ ముగించేలా నెట్‌వర్క్ నడుస్తోంది. దళారీలు ఆడింది ఆటగా.. పాడింది పాటగా హవా కొనసాగుతోంది. వారు చెప్పినట్టుగానే రిజిస్ట్రేషన్లు సాగుతున్నాయి. పైకం ఇవ్వని వారు రోజుల తరబడి ప్రదక్షిణలు చేసినా రిజిస్ట్రేషన్ జరగడం లేదు. కొత్తగా కుప్పానికి మున్సిపాలిటీ హోదా వచ్చిన నేపథ్యంలో క్రయ విక్రయాలపై ప్రజలను మభ్య పెట్టి రూ.వేలలో డిమాండ్ చేస్తున్నారు. చివరకు అనుభవ ధ్రువీకరణ పత్రాలకు కూడా రూ.20వేల వరకు వసూలు చేస్తున్నారు. 15 రోజుల క్రితం దళవాయికొత్తపల్లెకు చెందిన నారాయణప్ప అనే వ్యక్తి తనకు వారసత్వంగా వచ్చిన అనుభవ పత్రాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు దళారీలు రూ.20 వేలు అడిగారని బహిరంగంగానే వ్యాఖ్యానించాడు. అలాగే పట్టణంలోని పైబాట , గుడుపల్లె రోడ్డులోని కొంత భూమి వక్ఫ్ బోర్డుకు చెందినట్లు రెవెన్యూ రికార్డుల్లో తప్పుగా నమోదు కావడంతో అందులోని ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయించేందుకు దళారీలు భారీ మొత్తంలో వసూలు చేసినట్లు తెలిసింది. అయినప్పటికీ రిజిస్ట్రేషన్ కాలేదని బాధితులు నిత్యం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం చుట్టూ తిరుగుతుండడం గమనార్హం. ఈ క్రమంలోనే డాక్యుమెంట్ల తయారీకి కంప్యూటర్ సెంటర్ నిర్వాహకులు కూడా యథేచ్ఛగా దోపిడీ చేసేస్తున్నారు. ఎలాంటి పత్రాలకైనా రూ.2వేల నుంచి రూ.5వేల వరకు లాగేస్తున్నారు.

పర్యవేక్షణలో నిర్లక్ష్యం

రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా డాక్యుమెంట్లు, సర్టిఫికెట్ల పరిశీలన, పర్యవేక్షణలో అధికారులు పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారు. దళారీలు చెప్పిందే వేదంగా రిజిస్ట్రేషన్లు చేసేస్తున్నారు. అందులో భాగంగానే ఇటీవల తమిళనాడు రాష్ట్రం ఆంబూరు చెందిన కాంచన అనే మహిళ పేరుతో నకిలీ డెత్ సర్టిఫికెట్ సృష్టించి, ఆమె ప్లాట్లును కొందరు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దీనిపై బాధితురాలు నాలుగు రోజుల క్రితం కుప్పం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి ఆందోళనకు దిగింది. ఈ రిజిస్ట్రేషన్ కూడా ఓ దళారీ కనుసన్నల్లో జరిగినట్లు తెలిసింది. ఇందుకోసం రూ.2లక్షల వరకు చేతులుమారినట్లు సమాచారం. కార్యాలయ సిబ్బంది, సాక్షులు, కంప్యూటర్ సెంటర్ నిర్వాహకులకు వాటాలు ముట్టినట్లు తెలుస్తోంది.

తమిళనాడు అధికారుల ఆరా

కుప్పం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గత ఏడాది నకిలీ డెత్ సర్టిఫికెట్‌తో జరిగిన ప్లాట్ రిజిస్ట్రేషన్‌పై తమిళనాడు అధికారులు విచారణ చేపట్టారు. తమిళనాడులో గుడియాత్తం మున్సిపాలిటీ నుంచి కాంచన అనే మహిళ మృతి చెందినట్లు మరణ ధ్రువీకరణ ప్రతం కుప్పం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బయటకు పడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే నకిలీ సర్టిఫికెట్‌లో రిజిస్ట్రేషన్ చేసిన సబ్ రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య, కొనుగోలు చేసిన గౌస్‌బాషా, విక్రయించిన రవి పెరుమాళ్‌పై కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ శ్రీధర్ తెలిపారు.

మగ్గానికి మహర్దశ

- కలెక్టరేట్‌లో వైఎస్సార్ నేతన్న నేస్తం జిల్లాస్థాయి కార్యక్రమం
- జిల్లాలో 194 మందికి రూ.46.56 లక్షల లబ్ధి



లబ్ధిదారులకు మెగా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద, కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మగ్గానికి మహర్దశ వచ్చిందని, దేశంలో ఎక్కడా లేని విధంగా నేతన్నల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మేయర్ అముద తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వైఎస్సార్ నేతన్న నేస్తం జిల్లా స్థాయి కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే, మేయర్ మాట్లాడుతూ సొంత మగ్గం ఉన్న ప్రతి చేనేత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తోందన్నారు. కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన 194 మంది చేనేతలకు రూ.46.56 లక్షలు అందించినట్లు వెల్లడించారు. నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోనే నగదు జమవుతుందన్నారు. జిల్లాలోని 3,256 మంది చేనేత కార్మికులకు ప్రతి నెలా ఒక్కొక్కరికి రూ.2,750 చొప్పున పింఛన్ అందిస్తున్నామని తెలిపారు. ముద్ర యోజన పథకం క్రింద చేనేత కార్మికులకు సబ్సిడీపై రూ.25వేల మంజూరు చేస్తున్నట్లు వివరించారు. 2022–23లో 53 మంది చేనేత కార్మికులకు రూ.26.50 లక్షలు, 2023–24లో జూన్ వరకు 23 మందికి రూ.11.50 లక్షల రుణసౌకర్యం కల్పించినట్లు చెప్పారు. పెనుమూరులో 100 మందితో క్లస్టర్ మంజూరైందన్నారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ జోనల్ చైర్మన్ శైలజా మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ముఖ్యమంత్రి ఇచ్చిన మాటకు కట్టుబడి కరోనా కష్టకాలంలో నవరత్నాలను అమలు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీమహిళా స్థాయీ సంఘం చైర్మన్ భారతి, జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్షేత్రస్థాయిలో నేతన్నల కష్టాలు తెలుసుకున్నారు. అందుకే ఇచ్చిన హామీని క్రమం తప్పకుండా ఏటా అమలు చేస్తున్నారు. ఈ పథకంలో నేతన్నల ఇక్కట్లు తొలగుతున్నాయి. మాకు ఇంత అండగా నిలిచిన ముఖ్యమంత్రికి జీవితాంతం రుణపడి ఉంటాం.

– ఆకుల వాసు, రాష్ట్ర చేనేత కార్మికుల యూనియన్ అధ్యక్షుడు

సద్వినియోగం చేసుకుంటాం



వైఎస్సార్ నేతన్న నేస్తం కింద ప్రభుత్వం అందించే నగదును సద్వినియోగం చేసుకుంటాం. ఈ నగదుతో ముడి సరుకు కొనుగోలు చేసుకుంటాం. తమిళనాడు నుంచి మెటీరియల్ తెచ్చుకుంటున్నాం. మా కుటుంబానికి నేతన్న నేస్తంతో పాటు మా అమ్మాయికి విద్యాదీవెన, వసతిదీవెన అందుతున్నాయి. నాకు బ్యాంకు రుణం, ఆసరా, సున్నావడ్డీ కింద లబ్ధి చేకూరింది. ఇంత సాయం చేసిన జగనన్నకు కృతజ్ఞతలు.

–సి.రూప,పెనుమూరు

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ షణ్మోహన్ హెచ్చరించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పకడ్బందీగా పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. జిల్లాలో 0–5సంవత్సరాల పిల్లలందరికీ జనన ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పీహెచ్‌సీల్లో గర్భిణుల వివరాలను పక్కాగా నమోదు చేయాలని సూచించారు. కాన్పు అయ్యేవరకు కచ్చితంగా పర్యవేక్షించాలని కోరారు. ఇంటింటి సర్వే చేపట్టి ఐదేళ్ల పిల్లలకు టీకాలు వేయించడంపై అవగాహన కల్పించాలని వెల్లడించారు. డీఎంహెచ్‌ఓ ప్రభావతి, ఐసీడీఎస్ పీడీ నాగశైలజా పాల్గొన్నారు.

చంద్రబాబు వస్తే కరువు కాటకాలే



డిప్యూటీ సీఎం నారాయణస్వామి

వెదురుకుప్పం : చంద్రబాబు వస్తే కరువు కాటకాలు చుట్టుముడతాయని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రైతులు వ్యవసాయం చేయలేక వలస వెళ్లే దుర్భర పరిస్థితులు వస్తాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సస్యశ్యామలంగా వర్ధిల్లుతోందని వెల్లడించారు. ప్రభుత్వంపై దండయాత్ర చేయాలన్న చంద్రబాబు వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు దోమలపై దండయాత్ర అని ప్రజాధనాన్ని ఎలా దోచుకున్నారో అందరికీ తెలుసన్నారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సంక్షేమం, అభివృద్ధి పథకాలు పకడ్బందీగా అమలవుతున్నాయని వివరించారు. జగనన్న పథకాలను రద్దు చేసేందుకు చంద్రబాబు, పవన్ కల్యాణ్, ఎల్లో మీడియా పథకం ప్రకారం అసత్య ప్రచారాలు చేస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. జనం గుండెల్లో సీఎం జగనన్న సుస్థిర స్థానం పొందారని, జనం నుంచి జగన్‌ను వేరుచేసే సత్తా ఎవరికీ లేదన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అడ్డుకునేందుకు యత్నిస్తున్న టీడీపీ, జనసేనను తరిమికొట్టే సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు.


ప్రత్యామ్నాయ పంటలకు ప్రోత్సాహం



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పి.రామచంద్రారెడ్డి, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ చిరుధాన్య పంటలకు మరింత ప్రోత్సాహకాలు ఇవ్వాలని సూచించారు. ఇప్పటి వరకు సుమారు 3వేల హెక్టార్లకు సంబంధించి విత్తనాలు పంపిణీ చేశారని తెలిపారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మామిడి కోత దాదాపు పూర్తయ్యిందన్నారు. యాజమాన్య పద్ధతులను వినియోగించి తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందేలా అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. ఆర్‌బీకేల్లో మద్దతు ధరలు, ఎరువుల నిల్వలపై కచ్చితమైన సమాచారాన్ని నోటీసుబోర్డుల్లో ఉంచాలని సూచించారు. చిరుధాన్యాలకు సాగుకు జెడ్పీ ఫండ్స్ నుంచి జిల్లాకు రూ.40 లక్షలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఉద్యానశాఖ డీడీ మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ మామిడిని ఆశిస్తున్న పురుగుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై శాస్త్రవేత్తలతో అధ్యయనం చేయించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఇరిగేషన్ ఎస్‌ఈ విజయ్‌కుమార్‌రెడ్డి, సెరికల్చర్ అధికారి శోభారాణి, సభ్యులు సుధీర్ రెడ్డి, గోవర్ధన్ బాబి పాల్గొన్నారు.

క్రీడారంగం అభివృద్ధికి ప్రాధాన్యం



జేసీకి చెక్కును అందజేస్తున్న దాత

చిత్తూరు కలెక్టరేట్ : క్రీడారంగం అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు జేసీ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గాంధీ జయంతి రోజున నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరాలకు కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. పోటీల నిర్వహణకు క్రీడాభిమానులు సహకరించాలన్నారు. ఈ సందర్భంగా దాతలు విఠల్‌రెడ్డి రూ. లక్ష, ఇంద్రరెడ్డి రూ.25 వేలు, గుణశేఖర్ రూ.15 వేలు, శివయ్య రూ.5 వేలను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

‘జన ఔషధి’కి ఝలక్!

ప్రజలకు తక్కువ ధరకే మందులు అందించేందుకు కేంద్రప్రభుత్వం ×ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి పరియోజన×కు శ్రీకారం చుట్టింది. ప్రత్యేకంగా దుకాణాలను ఏర్పాటు చేసి చౌకగా జెనరిక్ మెడిసిన్స్ విక్రయిస్తోంది. అయితే ప్రైవేటు వ్యక్తులు నిర్వహించే మెడికల్ షాపుల్లో జెనరిక్ మందులు అమ్మడం లేదు. కొందరు వైద్యులతో కుమ్మక్కై బ్రాండెడ్ మెడిసిన్స్‌నే అందుబాటులో ఉంచుతున్నారు. దీంతో షుగర్.. బీపీ తదితర దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కారు చౌకగా లభించే జెనరిక్ మందులు దొరకకపోవడంతో చేసేదిలేక ఎక్కువ ధర చెల్లించి బ్రాండెడ్ మెడిసిన్స్‌నే కొనుగోలు చేసుకుంటున్నారు. జిల్లా సరిహద్దు మండలాల్లోని వారైతే పొరుగు రాష్ట్రాల్లోని జెనరిక్ షాపులకు వెళ్లి మందులు తెచ్చుకుంటున్నారు.

- కనుమరుగవుతున్న జెనరిక్ దుకాణాలు
- మెడికల్ షాపుల నిర్వాహకులతో కుమ్మక్కవుతున్న వైద్యులు
- ఖరీదైన మందులతో ప్రజల జేబుకు చిల్లు



కర్ణాటకలోని ముళబాగిలులో ఏర్పాటు చేసిన జెనరిక్ మందుల దుకాణం





బ్రాండెడ్ కంపెనీ తయారు చేసిన షుగర్ మాత్రలు

పలమనేరు : ఒకే రకమైన మందులు, ఒకే ఫార్ములాతో తయారుచేయబడినవి బ్రాండెడ్ పేరిట అధిక ధరలకు అమ్ముతుంటే, జనరిక్ దుకాణాల్లో కారుచౌకగా విక్రయిస్తున్నారు. జిల్లాలోని మెడికల్‌షాపుల్లో ఎక్కడా రోగులకు జెనరిక్ మందులను అమ్మడం లేదు. రోగులు వీటికి అలవాటు పడితే బ్రాండెండ్ మందులను కొనరని పసిగట్టిన మెడికల్స్ నిర్వాహకులు ఓ పద్ధతి ప్రకారం జెనరిక్ దుకాణాలు లేకుండా చేసేస్తున్నారు. దీనికి తోడు కొందరు ప్రైవేటు వైద్యులు సైతం మెడికల్ దుకాణాలవారు ఇచ్చే కమీషన్లు, ఫార్మా కంపెనీల ప్రతినిధులు అందించే బహుమతులు, టూర్‌లకు దాసోహమై జెనరిక్ మందులను రాయడమే మానేశారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ నిత్యం మందులను వాడే రోగులు అధిక ధరలకు బ్రాండెడ్ మెడిసిన్స్ కొనలేక కర్ణాటక, తమిళనాడులోని జెనరిక్ దుకాణాలపై ఆధారపడుతున్నారు.

70శాతం తక్కువ ధర...

మధుమేహ వ్యాధికి సంబంధించి మాక్‌గ్లిమ్ (ఎంపీ-2)(గ్లెమిప్రైడ్, పయోగ్లిటజోన్ అండ్ మెట్‌ఫార్మిన్ ట్యాబ్లెట్ స్ట్రిప్ (10 మాత్రలు) రూ.82.90 పైసలుగా ఉంది. అంటే ఓ ట్యాబ్లెట్ ధర రూ.8.30 పైసలు. అదే జెనరిక్ దుకాణంలో ఇదే ట్యాబ్లెట్ల ధర రూ.31.90పైసలుగా ఉంది. అంటే ఓ ట్యాబ్లెట్ రూ.3లకే దొరుకుతుంది. సాధారణంగా జ్వరానికి వాడే డోలో–650 స్ట్రిప్ (15 ట్యాబెట్లు) రూ.40లుగా ఉండగా ఇవే జెనరిక్‌లో రూ.10.18 పైసలుగా ఉంది. అంటే బ్రాండెడ్ మెడిసిన్స్ కంటే జెనరిక్ మందులు 60 నుంచి 70శాతం తక్కువకే దొరుకుతున్నాయి. అయితే జెనరిక్ షాపులు అవసరాలకు తగ్గట్టు అందుబాటులో లేకపోవడంతో రోగులు ఇబ్బందిపడుతున్నారు. గతంలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మెప్మా ఆధ్వర్యంలో పట్టణాలు, నగరాల్లో జెనరిక్ దుకాణాలు ఏర్పాటు చేశారు. కాలక్రమంలో నష్టాలను చూపించి కొన్ని మూసివేశారు. తొలుత 15 జెనరిక్ షాపులు ఉంటే, ప్రస్తుతం పది మాత్రమే ఉన్నాయి. అది కూడా చిత్తూరు, తిరుపతికి మాత్రమే పరిమితం కావడం గమనార్హం.

తేడా ఏంటంటే..!

సాధారణంగా ఒక ఫార్మా కంపెనీ ఓ మందును పరిశోధనలు చేసి కనిపెట్టి దానిపై క్లినికల్ ట్రయల్స్ చేసి డగ్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నుంచి పేటెంట్ పొందుతుంది. దీనిపై 20 ఏళ్ల పాటు సంబంధిత కంపెనీకే సర్వ హక్కులు దక్కుతాయి. అదే మందును 20 ఏళ్ల దాటిన తర్వాత ఏ కంపెనీనైనా ఆ ఫార్ములాను ఉపయోగించి ట్యాబెట్లు తయారు చేసుకోవచ్చు. దీంతో వీటి ధర కారుచౌకగా మారుతుంది. ఈ రెండింటిలోనూ ఒకే మందు ఉంటుంది. కాని ఈ విషయాన్ని జనానికి తెలియకుండా బ్రాండెడ్ కంపెనీలు మభ్యపెడుతున్నాయి.

కర్ణాటకకు వెళుతున్నాం



షుగర్ మాత్రలు స్థానిక మెడికల్ షాపుల్లో ఎక్కు వ ధర. అదే కర్ణాటకలో ని జెనరిక్ దుకాణంలో తక్కువ రేటుకే దొరుకుతున్నాయి. అందుకని నేను తరచూ ముళబాగిళు, కోలారుకు వెళ్లి మందులు కొనుక్కొంటున్నా. జెనరిక్ దుకాణాలను ప్రతి మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తే అందరికీ సౌకర్యంగా ఉంటుంది.

– ఆనంద్, బైరెడ్డిపల్లె

ఫార్ములా ఒకటే



బ్రాండెడ్ ట్యాబెట్లు, జెనరిక్ మందుల్లో ఫార్ములా ఒకటే. అయితే బ్రాండెడ్ కంపెనీలకు అలవాటైన వారు జెనరిక్ మందులపై అపోహలు పెంచుకుంటున్నారు. జెనరిక్ ట్యాబెట్ల ధర చాలా తక్కువగా ఉండడంతో ఇవి మంచి మాత్రలు కావేమో అని అనుమానపడుతున్నారు. ఎలాంటి వ్యాధికైనా జెనరిక్ మందులను ధైర్యంగా వాడొచ్చు.

– హరగోపాల్, సూపరింటెండెంట్, ఏరియా ఆస్పత్రి, పలమనేరు

యువతి అదృశ్యంపై కేసు


జయలక్ష్మి (ఫైల్)

చౌడేపల్లె : మండలంలోని బోయకొండ సమీపంలో ఆర్‌ఆర్‌కాలనీకి చెందిన ఆవుల జయలక్ష్మి(22) అనే యువతి అదృశ్యంపై కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ రవికుమార్ శుక్రవారం తెలిపారు. రెండురోజుల నుంచి జయలక్ష్మి కనిపించడం లేదని తండ్రి శీను ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. యువతికి మూగ, చెవుడు ఉందని వివరించారు. ఆచూకీ తెలిసిన వారు నంబర్‌కు 9440900698 సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పలమనేరు : మండలంలోని కొలమాసనపల్లె పంచాయతీ చెన్నుపల్లె వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. పలమనేరు మంవడలం సంబార్‌పూర్‌కు చెందిన వినోద్(25) బైరెడ్డిపల్లె నుంచి బైక్‌పై వస్తుండగా బొలేరో వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


వేణుగోపాల్‌రెడ్డి మృతదేహం

చిత్తూరు అర్బన్: నగరంలోని మిట్టూరులో నివసిస్తున్న వేణుగోపాల్‌రెడ్డి (29) అనే వ్యక్తి శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి కథనం మేరకు.. యాదమరి మండలం ఎర్రచేనుకు చెందిన వేణుగోపాల్‌రెడ్డి కొన్నేళ్లుగా చిత్తూరులోని కొంగారెడ్డిపల్లెలో సౌండ్ సిస్టమ్, డీజే పరికరాలు అద్దెకు ఇస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. పది నెలల క్రితం డీజేలో పాటలు పాడటానికి వచ్చిన ఓ మహిళతో వేణుగోపాల్‌రెడ్డికి పరిచయం ఏర్పడింది. ఆమెను పెళ్లి చేసుకుని కొంగారెడ్డిపల్లెలో మరో కాపురం పెట్టాడు. విషయం మొదటి భార్య, కుటుంబ సభ్యులకు తెలిసిపోయింది. దీంతో గొడవలు మొదలయ్యాయి. ఒత్తిడి తట్టుకోలేక వేణుగోపాల్‌రెడ్డి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పేదల గుండె నిండా జగనన్నే

- ప్రతి గడపలోనూ రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు లబ్ధి
- చంద్రబాబు, పవన్‌లు ఎన్ని విమర్శలు చేసినా నమ్మే స్థితిలో ప్రజలు లేరు
- గడప గడప కార్యక్రమంలో ఎమ్మెల్యే భూమన


జగనన్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

తిరుపతి మంగళం: ‘పేదోళ్లే నా జీవితం.. పేదవాళ్లే నా ఊపిరి.. పేదవాళ్ల సంక్షేమమే నా లక్ష్యం’ అంటూ అనేక సంక్షేమ పథకాలు అందించి పేదోళ్ల గుండెల్లో సీఎం జగనన్నే సుస్థిర స్థానం సంపాదించుకున్నారని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. తిరుపతి 7వ డివిజన్ కొర్లగుంటలో శుక్రవారం డివిజన్ అధ్యక్షుడు చిమట రమేష్, టౌన్ బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ గడప గడప కార్యక్రమాన్ని నిర్వహించారు. నాలుగేళ్ల పాలనలో జగనన్న అందించిన సంక్షేమ పథకాలను స్థానిక ప్రజలకు ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి వివరించారు. ఏ గడపకు వెళ్లినా రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు లబ్ధిపొందిన వాళ్లే కనిపించారని తెలిపారు. అలాంటి గొప్ప నాయకుడు జగనన్నను మళ్లీ మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని ప్రజలకు సూచించారు. పేదోళ్ల పక్షాన నిలబడి అనేక సంక్షేమ పథకాలను అందించి పేదల జీవితాల్లో వెలుగులు నింపిన నాయకుడు జగనన్న అయితే, పెత్తందారులకు కొమ్ముగాస్తూ రూ.కోటాను కోట్లు దండుకున్న నాయకులు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ అన్నారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చిన పాపాన పోలేదన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు జగనన్నపై ఎన్ని విమర్శలు చేసినా ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, టీ.మునిరామిరెడ్డి, టౌన్ బ్యాంక్ డైరెక్టర్లు వేమూరి జ్యోతిప్రకాష్, వెంకటేష్, పార్టీ నాయకులు దొడ్డారెడ్డి సిద్దారెడ్డి, పాముల రమేష్‌రెడ్డి, దేవదానం, బీ.రవిచంద్రారెడ్డి, ధనశేఖర్, వెంకటేసరాయల్ జగదీష్, ఈశ్వర్, పురుషోత్తం, అమూల్‌బాబు, నాదముని, శ్యామల పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల కర్ణాటక మద్యం పట్టివేత


చిత్తూరులో సీజ్ చేసిన మద్యంతోపాటు నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు


నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్‌ఈబీ సిబ్బంది


పలమనేరు : పట్టుబడిన మద్యం, వాహనంతో సెబ్ అధికారులు

చిత్తూరు అర్బన్/పలమనేరు : జిల్లాలో శుక్రవారం వేర్వేరు చోట్ల పోలీసులు, ఎస్‌ఈబీ అధికారులు చేపట్టిన తనిఖీల్లో కర్ణాటక మద్యం పట్టుబడింది. వివరాలు.. తిరుపతి–బెంగళూరు జాతీయ రహదారిపై చెర్లోపల్లె వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా కారులో 50 బాక్సుల్లో తీసుకువస్తున్న టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. చిత్తూరు తేనబండకు చెందిన ఎస్.తులసీరామ్(28) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు ఎస్.జయశంకర్ పరారయ్యాడు. కారుతోపాటు పట్టుబడిన మద్యం విలువ సుమారు రూ.4లక్షలు ఉంటుందని డీఎస్పీ శ్రీనివాసమూర్తి తెలిపారు. కార్యక్రమంలో సీఐ గంగిరెడ్డి, ఎస్ఐ ఉమామహేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

ఎస్‌ఈబీ ఆధ్వర్యంలో

చిత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్‌ఈబీ) రూరల్ పోలీసులు కర్ణాటక మద్యం తరలిస్తున్న టి.బాబు (50) అనే వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేశారు. సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పలమనేరు–చిత్తూరు జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితుడు పట్టుబడ్డాడు. 90 టెట్రా ప్యాకెట్లు సీజ్ చేశారు. తనిఖీల్లో ఎస్ఐ మోహన్‌బాబు, సిబ్బంది కిరణ్, వెంకటేష్ పాల్గొన్నారు.

పలమనేరులో..

జరావారిపల్లె–కీలపట్ల మార్గంలోని గంగమ్మ గుడి వద్ద ఓ కారులో రూ.2లక్షలు విలువైన 480 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ ఎల్లయ్య శుక్రవారం తెలిపారు. కారుతోపాటు మరో ఎస్కార్ట్ బైక్‌ను సీజ్ చేసినట్లు వెల్లడించారు. గంగవరం మండలం కీలపట్లకు చెందిన భద్రయ్యపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. దాడుల్లో ఎస్ఐ రామదాసు పాల్గొన్నారు.